క్లుప్తంగా

క్రికెట్ టోర్నీ పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి పొంగులేటి

ఖమ్మం రూరల్: మండలంలోని కరుణగిరి కేంద్రీయ విద్యాలయం రోడ్‌లో పీఎస్ఆర్ యూత్ సభ్యుడు ఏనుగు మహేశ్ ఆధ్వర్యాన ఫిబ్రవరి 2 నుంచి 9వ తేదీ వరకు జరిగే పాలేరు స్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్లను శనివారం రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని మంత్రి క్వార్టర్స్‌లో పోస్టర్లతో పాటు టీషర్ట్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూత్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

ఎస్‌జీటీలకు అవకాశం ఇవ్వాలి..

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించే క్రమంలో ఎస్‌జీటీలకు సైతం అవకాశం ఇవ్వాలని పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మట్టా శ్రీనివాసరావు, కొమ్మినేని అనిల్‌కుమార్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీల్లో ప్రత్యేకాధికారులను తహసీల్దార్, ఎంపీడీఓ, జీహెచ్ఎంలతో స్కూల్ అసిస్టెంట్లను తీసుకున్నట్లయితే ఎస్‌జీటీ(సెకండరీ గ్రేడ్ టీచర్లు)ను కూడా తీసుకోవాలన్నారు.

తలసేమియా రహిత సమాజమే ధ్యేయం



మాట్లాడుతున్న ప్రొద్దుటూరి అనిత

ఖమ్మంవైద్యవిభాగం: తలసేమియా వ్యాధి రహిత సమాజాన్ని నిర్మించడమే సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ధ్యేయమని, ఈ వ్యాధిని నివారించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సంస్థ ఫౌండర్ మెంబర్ ప్రొద్దుటూరి అనిత పేర్కొన్నారు. శనివారం ఖమ్మంలోని పులిపాటి నర్సింగ్ కళాశాలలో సంస్థ ఆధ్వర్యాన తలసేమియా వ్యాధిపై అవగాహన కల్పించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. తలసేమియా వ్యాధికి పూర్తి చికిత్స లేదని, రక్తం, మందులు ఇచ్చి చిన్నారుల జీవితకాలన్ని పెంచొచ్చన్నారు. ఇద్దరు తలసేమియా వాహకులు, మేనరిక వివాహాలు చేసుకోవడం ద్వారా ఈ వ్యాధి వస్తుందని, వివాహం చేసుకునేముందు హెచ్.బీ.ఏ-2 (ఎలెక్ట్రోఫొరెసిస్) టెస్ట్ చేయించుకోవాలని సూచించారు. ప్రజల్లో తలసేమియాపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ నాగజ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఉపాధ్యక్షురాలు పి.పావని, కోశాధికారి పి.రవిచంద్ర, కళాశాల అధ్యాపకులు స్వప్న, డాక్టర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సోమ్‌లాల్‌కు పద్మశ్రీ అవార్డుపై హర్షం

ఖమ్మంఅర్బన్: ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతావత్ సోమ్‌లాల్ నాయక్‌కు పద్మశ్రీ అవార్డు దక్కడంపై సంఘం జిల్లా కమిటీ బాధ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ తరఫున ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఖమ్మంలోని సంఘం కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో పలువురు మాట్లాడారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ బస్కినాయక్, జిల్లా అధ్యక్షుడు రామ్మూర్తి నాయక్‌తో పాటు తేజావత్ శివాజీనాయక్, బానోత్ తారాదేవి, బానోత్ చందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తగా సాగుదాం..!



మల్చింగ్, డ్రిప్ విధానంలో చిక్కుడు, బొప్పాయి సాగు చేసిన బానోత్ వీరన్న



బంతితోట, క్యాబేజీ సాగు చేసిన మద్దిబోయిన వెంకన్న

తీరొక్క పంట.. సిరుల ఇంట..

- ఆధునిక పద్ధతిలో సాగు చేస్తున్న రైతులు
- ఏదో ఒక పంటపై లాభం పొందుతున్న వైనం
- పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న సాగుదారులు

సండే స్పెషల్

కామేపల్లి: రైతులంతా మార్కెట్‌లో డిమాండ్ ఉన్న ఒకే రకమైన పంటలను పంటల సాగు చేయడం.. పంట దిగుబడి ఒకే సమయాన చేతికంది.. అమ్మేందుకు మార్కెట్‌కు వెళ్తే ఆ పంటలకు ధర తగ్గడం.. దీంతో రైతు డీలా చెంది అప్పుల ఊబిలో కురుకుపోవడం ఇలాంటి సంఘటనలు తరుచూ మనం చూస్తూనే ఉన్నాం. కానీ కొందరు రైతులు అందుకు భిన్నంగా ఒకే రకమైన పంటను సాగు చేయకుండా తమకున్న కొద్దిపాటి భూమిలో తీరొక్క పంటను సాగు చేయడం ప్రారంభించారు. ఒకే రకమైన పంటను సాగు చేసి నష్టాలను చవిచూసే బదులు తీరొక్క పంటలను సాగు చేస్తే ఒక పంటలో నష్టం వచ్చినా.. మరో పంటలో లాభం పొంది నష్టపోకుండా ఉండొచ్చునని రైతులు భావించారు. మార్కెట్‌లో ఒక్కో పంటకు ఒక రకమైన ధర ఉండడంతో నష్టపోయే అవకాశం లేకుండా లాభాలను ఆర్జిస్తున్నారు.

వాణిజ్య పంటల సాగు వైపే చూపు..

రైతులు మార్కెట్‌లో ధరను చూసి ఎక్కువ లాభాలను ఆర్జించాలని పంటలను సాగు చేయడం చివరికి అమ్మే సమయానికి మార్కెట్‌లో ధర లేకపోవడంతో పంట సాగుకు తెచ్చిన అప్పులు తీరక నష్టాలను చవిచూడడం పరిపాటిగా మారి నష్టాలను మూటకట్టుకుంటున్నారు. వాణిజ్య పంటలకు మార్కెట్లో ఎప్పటికప్పుడు ధరల వ్యత్యాసం ఉంటుంది. అంతేకాక వాటి సాగుకు అధిక పెట్టుబడి పెట్టాల్సి వస్తుంది. అదే వాణిజ్య పంటలతో పాటు అపరాలు, కూరగాయలు, పూల తోటలను సాగు చేస్తే లాభాలను ఆర్జించవచ్చని వ్యవసాయాధికారులు రైతులకు సూచిస్తున్నారు. కాగా, మొదట వచ్చిన పంటను విక్రయించగా వచ్చిన సొమ్ముతో ఇతర పంటలకు పెట్టుబడిగా ఉపయోగపడి ఆర్థికంగా ఇబ్బంది పడాల్సిన పనిలేదని రైతులు చెబుతున్నారు.

మల్చింగ్, డ్రిప్ పద్ధతిలో..

పంటలను ఆధునిక పద్ధతిలో అనగా.. మల్చింగ్, డ్రిప్ పద్ధతి ద్వారా ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. ఈ విధానంతో కూలీల ఖర్చు తగ్గడంతో పాటు పంట దిగుబడి పెరుగుతుందని రైతులు చెబుతున్నారు. వ్యవసాయాధికారులు కూడా రైతులు తమకున్న భూమిలో అన్ని రకాల పంటలను సాగు చేస్తే మేలంటున్నారు. దీంతో అన్ని రకాల పంటలను సాగు చేయడంలో రైతులు మెళకువలు పాటిస్తూ చీడపీడల నుంచి కాపాడుకుంటున్నారు. ఇలా వీరిని పలువురు ఆదర్శంగా తీసుకుని మరికొంత మంది ఈ విధానంపై ఆసక్తి చూపుతున్నారు.

అపరాలపై అనాసక్తి..

అపరాలు, కూరగాయల సాగు వైపు రైతులు ఎక్కువగా మొగ్గు చూపడం లేదు. పంట కాలం, పెట్టుబడి తక్కువ, మార్కెట్‌లో డిమాండ్ ఉన్నప్పటికీ కూడా సాగుకు రైతులు ఆసక్తి కనబర్చడం లేదు. వ్యవసాయాధికారులు అపరాలు, కూరగాయల సాగుతో లాభాలను ఆర్జించవచ్చని సూచించినా.. ఆ పంటల సాగువైపు రైతులు మక్కువ చూపడం లేదు.

కొంతమంది రైతుల అభిప్రాయాలిలా..

- కామేపల్లి మండలం పండితాపురం గ్రామానికి చెందిన బానోత్ వీరన్న తనకున్న మూడెకరాలతో పాటు మరో మూడు ఎకరాలు కౌలుకి తీసుకుని మూడెకరాల్లో మిర్చి, బొప్పాయి, మరో మూడెకరాల్లో టమాట, చిక్కుడు తోటలను సాగు చేశాడు. మల్చింగ్, డ్రిప్ విధానంతో సాగు చేస్తూ కూరగాయాలపై వచ్చిన లాభాలను మిర్చి పంటకు పెట్టుబడిగా పెట్టి సాగు చేస్తున్నాడు.
- అదే గ్రామానికి చెందిన మరో రైతు మద్దిబోయిన వెంకన్న తనకున్న అరెకరంలో బంతితోట, పచ్చిమిర్చి, క్యాబేజీ పంటలను సాగు చేశాడు. పంట పూర్తి కాగానే పంట మొక్కలను తొలగించి మళ్లీ కూరగాయలు సాగు చేస్తూ.. లాభాలు గడిస్తున్నారు.

అన్ని రకాల పంటలు సాగు చేయాలి..



వాణిజ్య పంటలతో పాటుగా ఇతర పంటలను సాగు చేపట్టాలి. వాణిజ్య పంటలకు మార్కెట్‌లో ధర ఎక్కువగా ఉన్నప్పటికీ కాలానుగుణంగా ధరల మధ్య వ్యత్యాసం వచ్చి లాభమో.. నష్టమో రావచ్చు. అందుకే ఒకే రకమైన పంటనే కాకుండా అన్ని రకాల పంటల సాగు చేపట్టాలి. అపరాలు, కూరగాయలకు మార్కెట్‌లో ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది.

–భూక్యా తారాదేవి,వ్యవసాయాధికారి, కామేపల్లి

ఒకే రకమైన పంటతో నష్టమే..



ఒకే రకమైన పంటతో లాభం కంటే నష్టమే ఎక్కువగా ఉంటుంది. పంట సాగు చేసినప్పుడు ఉన్న ధర పంట చేతికొచ్చే సమయానికి మార్కెట్‌లో ధర లేకుంటే పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి ఉండదు. అన్ని రకాల పంటల సాగుతో లాభం ఉంటుంది. ఓ పంటకు ధర తగ్గిన మరో పంటకు ధర ఉండొచ్చు.

– బానోత్ భీముడు, రైతు, పండితాపురం

తీరొక్క పంటతో మేలు..



ఒకే రకమైన పంట సాగుతో నష్టం వాటిల్లుతుంది. తీరొక్క పంట సాగుతో లాభాలు ఆర్జించవచ్చు. మార్కెట్‌లో అన్ని రకాల పంటలకు ఒకే రకమైన ధర ఉండకపోవచ్చు. అన్ని రకాల పంటల సాగు చేయడం ద్వారా లాభాలు పొందొచ్చు. వ్యవసాయాధికారులు వివిధ రకాల పంటల సాగు వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తే రైతులు కూడా ఆసక్తి చూపవచ్చు.

– ముత్యాల సత్యనారాయణ, రైతు, పండితాపురం

కేంద్ర ప్రభుత్వ విధానాలు వ్యతిరేకించండి..



సమ్మె నోటీస్ ఇస్తున్న కార్మిక సంఘాల నేతలు

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు, కార్మిక, వ్యవసాయ విధానాలను వ్యతిరేకిస్తూ ఫిబ్రవరి 16న చేపట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు యర్రా శ్రీకాంత్ పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని గుమ్మస్తాల సంఘం భవనంలో సీఐటీయూ త్రిటౌన్ కన్వీనర్ యర్రా మల్లికార్జున్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెట్టుబడిదారులు అంబానీ, అదానీలా ప్రభుత్వంగా మోదీ ప్రభుత్వం పనిచేస్తుందని విమర్శించారు. ఈ సమావేశంలో సంఘ జిల్లా నాయకులు బండారు యాకయ్య, బుక్క శ్రీనివాస్‌రావు, బండారు రమేశ్, కార్పొరేటర్ వెల్లంపల్లి వెంకట్రావు, ఎస్‌కె. సైదులు, బండారు వీరబాబు, పత్తిపాక నాగ సులోచన తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీ కమిషనర్‌కు సమ్మె నోటీస్..

ఫిబ్రవరి 16న జరిగే దేశ వ్యాప్త సమ్మె, గ్రామీణ బంద్‌లో మున్సిపల్ కార్మికులు పాల్గొంటారని కార్మిక సంఘాల నేతలు కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభికి శనివారం నోటీస్ అందజేశారు. ఐఎన్‌టీయూసీ, ఐఎఫ్‌టీయూ, ఏఐటీయూసీ, సీఐటీయూ, బీఆర్‌టీయూ సంఘాల నేతలు నరేశ్, జి.రామయ్య, గాదె లక్ష్మీనారాయణ, విష్ణు, పాషాలు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలకు నిరసనగా జాయింట్ ప్లాట్‌ఫాం ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ దేశ వ్యాప్త సమ్మెకు మద్దతు తెలుపుతున్నట్లు వెల్లడించారు. ఈ సమ్మెను జయప్రదం చేసేందుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘాల నాయకులు యర్రా శ్రీకాంత్, బండారు యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మోటివేషన్, తల్లిదండ్రులకు సన్మానాలు

ఖమ్మం సహకారనగర్: పదో తరగతిలో 10/10 జీపీఏ సాధించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు మోటివేషనల్ తరగతులు నిర్వహించగా.. గతేడాది 10/10 జీపీఏ సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులకు త్రివేణి పాఠశాల యాజమాన్యం శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా త్రివేణి పాఠశాలల డైరెక్టర్ గొల్లపుడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ తమ పాఠశాలలోని ఖమ్మం, సత్తుపల్లి బ్రాంచ్‌ల్లో 10/10జీపీఏ సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులను సన్మానించామన్నారు. ఈ కార్యక్రమంలో త్రివేణి కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, ప్రముఖ సైకాలజిస్ట్, మోటివేషనల్ స్పీకర్, కార్పొరేట్ ట్రైనర్ డాక్టర్ వంగిపురపు శ్రీనాథచార్యులు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, ప్రిన్సిపాళ్లు రాజేంద్రప్రసాద్, ఎం.వేణుగోపాల్, ఇన్‌చార్జ్‌లు స్వప్న, ముస్తఫా, అశోక్, చార్లెస్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ స్టేడియంలో నారాయణ విద్యార్థులు

ఖమ్మం స్పోర్ట్స్: హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో జరుగుతున్న భారత్– ఇంగ్లాండ్ మ్యాచ్‌ను తిలకించేందుకు నగరంలోని వీడీవోస్ కాలనీలో గల నారాయణ స్కూల్ విద్యార్థులు శనివారం తరలివెళ్లారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆహ్వానం మేరకు తరలివెళ్లినట్లునారాయణ స్కూల్ డైరెక్టర్లు గన్నవరపు చంద్రశేఖర్‌రావు, కొడుమూరి నాగపవన్, ప్రిన్సిపాల్ నరేంద్రవర్మలు తెలిపారు.

గిరిజన పాఠశాల సందర్శన

కామేపల్లి: టేకులతండ గిరిజన ప్రాథమిక పాఠశాలను అసిస్టెంట్ ట్రైబుల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ జహీరుద్దీన్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు శాతం, రిజిస్టర్లను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేపట్టాలని, వెనకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. ఐటీడీఏ ద్వారా పాఠశాలకు కల్పించిన సౌకర్యాలను హెచ్ఎం రాజాను అడిగి తెలుసుకున్నారు.

మిస్సైల్ మ్యాన్ హెల్పింగ్ హ్యాండ్స్ ఔదార్యం



ఆర్థిక సాయం అందజేస్తున్న సంస్థ బాధ్యులు

ఖమ్మంక్రైం: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ చిన్నారి వైద్యం కోసం మిస్సైల్ మ్యాన్ హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యాన రూ.లక్ష ఆర్థిక సాయం అందజేసి తమ ఔదార్యం చాటుకున్నారు. కూసుమంచి మండలానికి చెందిన చిన్నారి రుషిక అనారోగ్యంతో బాధపడుతుంది. ఈక్రమంలో వైద్య ఖర్చుల నిమిత్తం మిస్సైల్ మ్యాన్ హెల్పింగ్ హ్యాండ్స్‌ను సాయం కోరగా.. వారు స్పందించి శనివారం రూ.లక్ష సాయాన్ని చిన్నారి తల్లిదండ్రులు నందిని, శ్రీకాంత్‌లకు అందజేయగా.. వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు నరేశ్, సురేశ్, మారేశ్, కృష్ణమూర్తి, లక్ష్మీనారాయణ, వేణు, రమేశ్, మహేశ్, అశోక్, గోపి పాల్గొన్నారు.

నిర్మల్ హృదయ్‌లో 'స్పోర్ట్స్ ఫెస్ట్'

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని నిర్మల్ హృదయ్ పాఠశాలలో శనివారం స్పోర్ట్స్ ఫెస్ట్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా యూత్ అండ్ స్పోర్ట్స్ అధికారి తుంబూరు సునీల్‌రెడ్డి, ఖమ్మం అర్బన్ ఎంఈఓ ఎం.శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. విద్యార్థులకు చదువుతో పాటు ఆటలు కూడా అవసరమేనని భావించి స్పోర్ట్స్ ఫెస్ట్‌ను నిర్వహించడం అభినందనీయమన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించగా.. విద్యార్థులు ప్రదర్శించిన మాస్ డ్రిల్, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వంగా సాంబశివారెడ్డి, అధ్యక్షురాలు వంగా శివమ్మ, డైరెక్టర్ వంగా సుధాకర్‌రెడ్డి, హెచ్ఎంలు పద్మజ, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగమే దళితుల ఆయుధం

ఖమ్మం మామిళ్లగూడెం: అంబేడ్కర్ ఆశయం.. దళితుల రాజ్యాధికారంతోనే సాధ్యమని బహుజన పొలిటికల్ సెంటర్ రాష్ట్ర నాయకుడు పొడకంటి రాంబాబు అన్నారు. శనివారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అగ్రకులాలు, దళిత బహుజన జాతులపై దాడులు చేస్తూనే ఉన్నందున బహుజన కులాలు ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగమే దళితుల ఆయుధమన్నారు. ఈ సమావేశంలో గోపాలరావు, జే.బీ.రాజు, సీతామహాలక్ష్మి, దానేలు, వెంకయ్య, వీరబాబు, శ్రీను, రామారావు, బీఎస్పీ నాయకులు రాంబాబు, కృష్ణ, నరేశ్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి



కౌన్సెలింగ్ ఇస్తున్న టాస్క్‌ఫోర్స్ ఏసీపీ

ఖమ్మంక్రైం: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, లేకుంటే చర్యలు తప్పవని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శివరామయ్య హెచ్చరించారు. శనివారం ఖమ్మం డివిజన్ పరిధిలోని 22 మంది రౌడీషీటర్లు, చెడు ప్రవర్తన కలిగిన వారిని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ కార్యాలయానికి పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రౌడీషీటర్ ఉన్న ప్రతీ ఒక్కరికిపై ప్రత్యేక నిఘా ఉంటుందని, చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పూర్తిగా మారితే రౌడీ షీట్ తొలగించేందుకు కూడా అవకాశం ఉందని చెప్పారు.

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు

తిరుమలాయపాలెం: మండలంలోని పాలేరు, ఆకేరు ప్రాంతాల నుంచి ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని మండల తహసీల్దార్ రాంప్రసాద్ తెలిపారు. శనివారం మండలంలోని ముజాహిదిపురం పరిధిలోని పాలేరు కాల్వను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గత కొంత కాలంగా ఇసుక అక్రమ రవాణా సాగుతున్న నేపథ్యాన ఇసుక ఉన్న ప్రాంతాలను పరిశీలించారు. అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణాను నిరోధించేందుకు గట్టి నిఘా ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

హామీలు వెంటనే అమలు చేయాలి



మాట్లాడుతున్న పొంగులేటి సుధాకర్‌రెడ్డి

ఖమ్మం మామిళ్లగూడెం: ప్రజలకు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే వాటిని అమలు చేయాలని మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ తమిళనాడు రాష్ట్ర సహ ఇన్‌చార్జ్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోగా నిరుద్యోగ యువతకు రూ.4వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రియాంకగాంధీ ఇచ్చిన హామీ నేటి వరకు అమలు కాలేదన్నారు. మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు మాట్లాడుతూ.. సుబాబుల్, జామాయిల్ రైతులకు గిట్టుబాటు ధర రావడం లేదని, మద్దతు ధర ఇవ్వనిపక్షంలో మంత్రులను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఈవీ.రమేశ్, నరేంద్రరావు, జిల్లా ఇన్‌చార్జ్ త్రిలోక్, ఖమ్మం పార్లమెంట్ ఇన్‌చార్జ్ శ్రీకాంత్, పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరావులతో పాటు దనియాకుల వెంకటనారాయణయాదవ్, డీకొండ శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఖమ్మం మార్కెట్ కార్యదర్శి



కలెక్టర్‌కు మొక్క అందిస్తున్న ప్రవీణ్‌కుమార్

ఖమ్మంవ్యవసాయం: నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్ శనివారం కలెక్టర్ వీపీ గౌతమ్‌ను ఆయన చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందించారు. అనంతరం అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్‌ను కూడా కలిసి మొక్కను అందించారు. ఈ సందర్భంగా మార్కెట్ నిర్వహణ గురించి కలెక్టర్, అదనపు కలెక్టర్లు కార్యదర్శితో మాట్లాడారు.

మార్కెట్ కార్యదర్శిని కలిసిన వ్యాపార ప్రతినిధులు..

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్‌ను హోల్‌సేల్, రిటైల్ కూరగాయల మార్కెట్ కమీషన్ వ్యాపారులు శనివారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వ్యాపారులు పలు సమస్యలను కార్యదర్శి దృష్టికి తీసుకొచ్చారు. కమిటీ అధ్యక్షులు ఎండీ ఫజల్, కమీషన్ వ్యాపార ప్రతినిధులు గోపిశెట్టి నాగేశ్వరరావు, నాళం సతీష్, జక్కుల రామకృష్ణ, గిరి, శరత్, రాజేందర్, నరసింహారావు, నాగేశ్వరరావు, అంజయ్య, సాయి, నాగేశ్వరరావు, నాగయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి, పాల్గొన్నారు.

ఘనంగా ఆర్జేసీ విద్యార్థుల ఫేర్‌వెల్ డే వేడుకలు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎంబీ గార్డెన్స్‌లో ఆర్జేసీ జూనియర్ కళాశాల ఆధ్వర్యాన ఫేర్‌వెల్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ విద్యావేత్త, ఆర్జేసీ విద్యాసంస్థల చైర్మన్ గుండాల కృష్ణ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు.అనంతరం మాట్లాడుతూ.. పేదరికం, తెలివి చదువుకు అడ్డుకాదని, విద్యార్థుల చదువుకు తన సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయన్నారు. అనంతరం ఈ విద్యా సంవత్సరం పలు విభాగాల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు ఎస్.లక్ష్మీపతి, ఎ.లింగయ్య, ఇన్‌చార్జ్‌లు టి.ఉపేందర్, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

కూసుమంచి/నేలకొండపల్లి: మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యావిధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 3న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద చేపట్టే మహాధర్నాను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మస్తాన్ కోరారు. శనివారం కూసుమంచిలోని జేవీఆర్ కళాశాలలో నిర్వహించిన సెమినార్ కార్యక్రమంలో, నేలకొండపల్లి మండల కేంద్రంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మోదీ ప్రభుత్వం విద్యను వ్యాపారీకరణ, ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ చేసేందుకు కుట్రలు చేస్తుందన్నారు. మోదీ ప్రయత్నాలను తిప్పికొట్టేందుకు వేలాదిగా విద్యార్థులు ఢిల్లీ తరలివావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాగర్, గోపి, జగన్, లోకేశ్, సాయి, చరణ్, అనుజ, లక్ష్మి, అంజలి తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్

కామేపల్లి/నేలకొండపల్లి: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన శనివారం కామేపల్లి, నేలకొండపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కామేపల్లి హైస్కూల్ హెచ్ఎం సైలా, నేలకొండపల్లి మండల విద్యాశాఖాధికారి బి.రాములు మాట్లాడుతూ.. సమాజంలోని మూఢ నమ్మకాలను పారద్రోలడానికి జన విజ్ఞాన వేదిక కృషి అభినందనీయమన్నారు. అనంతరం టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సీహెచ్. భాస్కర్‌రెడ్డి, నేలకొండపల్లి మండల అధ్యక్షుడు సుంతరమోని నాగార్జున, జిల్లా నాయకుడు వెంకటేశ్వర్లు, జేవీవీ బాధ్యుడు ఎస్.వెంకటేశ్వర్లు, పీఈటీ సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	26	బచ్చలికూర	3
వంకాయ	20		20
బెండకాయ	46	పాలకూర	3
పచ్చిమిర్చి	36		20
కాకర	56	చుక్కకూర	3
బీర	50		20
దొండ	24	తోటకూర	2
పొట్లకాయ	40		10
చిక్కుడు	70	గోంగూర	2
గోరుచిక్కుడు	46		10
క్యాబేజీ	24	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	30		20
ఆలుగడ్డ	24	కొత్తిమీర	1
చామగడ్డ	64		30
క్యారెట్	30	పుదీన	1
క్యాప్సికం	56		20

–ఖమ్మం వ్యవసాయం

బెల్ట్ షాపులను రద్దు చేయాలని ధర్నా



ధర్నా చేస్తున్న పీవైఎల్, పీఓడబ్ల్యూ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలో బెల్ట్ షాపుల ద్వారా మద్యం ఏరులై పారుతుందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ షాపులను రద్దు చేస్తామని హామీ ఇచ్చారని, వెంటనే బెల్ట్ షాపులను రద్దు చేయాలని పీవైఎల్ రాష్ట్ర నాయకుడు జక్కుల శరత్ డిమాండ్ చేశారు. ఈమేరకు పీవైఎల్, పీఓడబ్ల్యూ ఆధ్వర్యాన శనివారం ఖమ్మంలోని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ.. గ్రామాలు, పట్టణాల్లో బెల్ట్ షాపులు 24 గంటలు తెరిచే ఉంటున్నాయని, వైన్, బార్ అండ్ రెస్టారెంట్‌లలో నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తుండడంతో యువత మద్యానికి బానిసలై ఉపాధి కోల్పోతున్నారని అన్నారు. తెలవారుజామునే మద్యం విక్రయిస్తున్న వైన్స్, బార్ అండ్ రెస్టారెంట్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ రాష్ట్ర నాయకులు శోభా, ఝాన్సీ, పీవైఎల్ రాష్ట్ర నాయకులు కసు మోహన్‌రెడ్డి, సురేశ్‌లతో పాటు స్వాతి, చందు, రవీందర్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

మట్టి తవ్వకాలపై తహసీల్దార్ విచారణ



మట్టి తవ్వకాల ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

కూసుమంచి: మండలంలోని జీళ్లచెరువు గ్రామంలో శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయానికి చెందిన భూముల్లో కొందరు స్థానిక నాయకులు గత ఏడాది అక్రమంగా మట్టిని తవ్వి తరలించినట్లు వచ్చిన ఫిర్యాదుపై శనివారం తహసీల్దార్ సంపత్‌కుమార్ విచారణ చేపట్టారు. ఆలయ ఈఓ నారాయణచార్యులు, సర్వేయర్ రవితో కలిసి మట్టి తవ్వకాల ప్రాంతాన్ని పరిశీలించారు. రైతులు, గ్రామస్తులతో మాట్లాడి వివరాలు సేకరించారు. గత మూడేళ్ల క్రితం జాతీయ రహదారి నిర్మాణ పనులకు ఇక్కడి నుంచి మట్టిని తరలించారని, అందుకు వారు కొంత పరిహారం చెల్లించారని, దాన్ని అడ్డు పెట్టుకుని గత సంవత్సరం స్థానిక బీఆర్ఎస్ నాయకులు కొందరు అక్రమంగా మట్టిని తవ్వి తరలించారని, అడ్డుకున్న తనను కూడా బదిలీ చేయించారని ఈఓ తహసీల్దార్‌కు వివరించారు. కాగా, అక్రమంగా మట్టిని తవ్విన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ కాంగ్రెస్ నాయకులు తహసీల్దార్‌నుకోరారు. ఈమేరకు విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పెండ్ర అంజయ్య, ఇంటూరి పుల్లయ్య, మంకెన వాసు, హరీశ్, కొండా శ్రీను, ఉపేందర్, రాంగోపాల్, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.